2024 ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధం

- చంద్రబాబువి మాయల ఫకీరు డ్రామాలు
- రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ అవసరాన్ని ప్రజలకు వివరిద్దాం
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి తావులేకుండా పాలన చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న జేసీఎస్ కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో 2024 ఎన్నికలకు ఓటు అడిగేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజాసమస్యలు తెలుసుకొని అధికారంలోకి రాగానే వాటి తూచా తప్పక అమలు చేశారన్నారు. ఇంటింటికీ పథకాలు అందించింది దేశంలో ఒక్క వైఎస్సార్‌సీపీనే అని పేర్కొన్నారు. ఏ ఒక్క పేదవాడు ఒక్క రుపాయి కూడా లంచం ఇవ్వకుండా సంక్షేమ పథకాలను పొందారని గర్వంగా చెబుతామన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షనేత చంద్రబాబు మాయల ఫకీరు డ్రామాలను ప్రజలు విశ్వసించరని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. పేదలకు పథకాలు ఇస్తుంటే ఓర్వలేని చంద్రబాబు రాష్ట్రాన్ని శ్రీలంకతో పోల్చి నేడు అవే పథకాలను కాపీ కొట్టారని మండిపడ్డారు. ప్రశ్నిస్తానని పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ ఇప్పుడు టీడీపీ అధినేతను సీఎం చేయడం కోసం పని చేస్తున్నారని దుయ్యబట్టారు. పవన్ పూటకో మాట మారుస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నాడన్నారు. సీఎంను ఏక వచనంతో సంభోదించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ అవసరం ఎంత ఉందో ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఎన్నడూ లేనంతగా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఎంతో సహకరిస్తున్నారని కొరముట్ల అన్నారు. ఆయన సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. కోడూరు–చిట్వేలి మధ్య రూ. 40 కోట్లతో రోడ్డు విస్తరణ, రూ. 40 కోట్లతో ప్రొటెక్షన్ వాల్, రైల్వేకోడూరు అండర్ బ్రిడ్జి ప్రారంభిస్తున్నామన్నారు. రెడ్డివారిపల్లి బ్రిడ్జి పనులు మొదలు పెట్టామన్నారు. ప్రధాని మోడీ చేయించిన సర్వేలో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయభేరి కచ్చితమని తేలడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, పచ్చమీడియాకు నిద్ర కరువైందన్నారు. సింగిల్‌గా పోటీ చేసే దమ్ములేని పార్టీలు మా పార్టీ గురించి, మా నాయకుడి గురించి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీతోపాటు తాను అండగా ఉంటానంటూ కొరముట్ల తెలియపరిచారు. పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ తరపున రూ.10 లక్షల ఇన్సురెన్స్‌ను చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్లు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, మందల నాగేంద్ర, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, ఉపసర్పంచ్ తోటశివసాయి, సీహెచ్ రమేష్, లింగం లక్ష్మీకర్, సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓబిలికి కొరముట్ల రాక

పెనగలూరు : మండలంలోని ఓబిలి గ్రామానికి నేడు (గురువారం) ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి తెలిపారు. ఓబిలి పంచాయతీలోని ఓదేటి వారిపల్లి, జడావారిపల్లి, అత్తిగారిపల్లి, కుడప అరుంధతివాడ, ఓబిలి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనుందన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి హాజరుకానున్నట్లు వారు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

టౌన్ ఎస్ఐకి సీఐగా పదోన్నతి


వెంకటేశ్వర్లు

రాజంపేట : రాజంపేట అర్బన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా పదోన్నతి పొందారు. గతంలో ఈయన రైల్వేకోడూరు, చిట్వేలి పోలీసుస్టేషన్‌లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. ఇంకా సీఐగా పోస్టింగ్ కేటాయించలేదు. సీఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లను పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని చింతలకుంట వాండ్లపల్లెలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలియజేశారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ. 30 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలియజేశారు.

పాఠశాలకు కుర్చీల వితరణ


టేకు కుర్చీలను అందజేస్తున్న వెంకటేశ్వర్లు

పెనగలూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు దాతలు పది టేకు కుర్చీలను బుధవారం వితరణ చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. పెనగలూరు హైస్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన కాలంగి వెంకటేశ్వర్లు తన తల్లిదండ్రులు చిత్తారి కాలంగి శేషయ్య, శాంతమ్మల జ్ఞాపకార్థం కుర్చీలను అందించినట్టు ఆయన చెప్పారు. దాతను పాఠశాల సిబ్బంది అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, వేణుగోపాల్ రెడి, పుచ్చకాయల ఎల్లయ్య, బీవి రాఘవరెడ్డి, మహేష్ నాయుడు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి అమావాస్య పూజలు


భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న దాతలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం స్వామివారితోపాటు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేసి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. పూజల్లో కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిల దాతృత్వంతో భక్తులకు అన్నదానం చేశారు. పాలక మండలి సభ్యులు, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.


సామాజిక సేవకు గుర్తింపు



మెమెంటోను అందుకుంటున్న వినయ్ కుమార్

రాయచోటి టౌన్ : పట్టణానికి చెందిన వినయ్‌కుమార్ చేసిన సామాజిక సేవను గుర్తించి సరస్వతి పరిషత్ కళాక్షేత్రం వారు సన్మానించారు. మంగళవారం హైదరాబాదు నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో వినయ్‌కుమార్ దేవనాథ జీయర్ స్వామి అభినందించి మెమెంటోతోపాటు సన్మానించినట్టు ఆయన తెలిపారు.

యాంటీ ర్యాగింగ్‌పై పోస్టర్ మేకింగ్ పోటీలు


విజేతలతో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి

రాజంపేట : యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా ఏఐటీఎస్‌లో యాంటీ ర్యాగింగ్‌పై పోస్టర్ మేకింగ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ, డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు, కో–ఆర్డినేటర్ చిన్నబాబు పాల్గొన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను ఆయన అందజేశారు.

సారా విక్రేత అరెస్ట్

పీలేరు రూరల్ : నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. ముందస్తు సమాచారంతో మండలంలోని జాండ్ల పంచాయతీ జాండ్లలో బుధవారం దాడులు నిర్వహించారు. మూడే అరుణను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు


ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ

రాయచోటి టౌన్ : ఆటోలకు ఇన్సూరెన్స్ పత్రాలు లేకుండా నడిపితే చర్యలుంటాయని ట్రాఫిక్ ఎస్ఐ మహ్మద్ రఫీ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాలతో రాయచోటి పట్టణంలో తిరుగుతున్న ఆటోలను ఆకస్మిక తనిఖీ చేశారు. వాటిలో 30 ఆటోలు ఇన్సురెన్స్ పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

20న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 20న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైవీయూ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో డీకే చదువుల బాబు జీవితం–సాహిత్యం అంశంపై డాక్టర్ ఎం.హరికిషన్ ప్రసంగించనున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం


డీఈఓ పురుషోత్తంను సత్కరిస్తున్న నిర్వాహకులు

రాయచోటి అర్బన్ : క్రీడా పోటీలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని డీఈఓ పురుషోత్తం అన్నారు. ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక వీఆర్ సీబీఎస్ఈ స్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో చదువుతోపాటు ఆటలు కూడా ఒక భాగమేనన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కూడా పెంపొందుతుందన్నారు. క్రీడల పాల్గొంచుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి చదువుపై మరింతగా దృష్టిని సారిస్తారన్నారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీలలో రాణించాలంటూ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీఆర్ పాఠశాల కరస్పాండెంట్ వెంకట్రామిరెడ్డి, రాజు పాఠశాలల కరస్పాండెంట్ భరత్ రాజు, ప్రధానోపాధ్యాయుడు సదాశివారెడ్డి, ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కిషోర్, పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు వీరాంజనేయులు, నరసరాజుతోపాటు పలువురు క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటానికి చేరుకున్న ప్రజా సంక్షేమ యాత్ర


ప్రజా సంక్షేమ యాత్ర సిద్దవటంకు చేరుకున్న దృశ్యం

సిద్దవటం : 2024లో వన్స్‌మోర్ అంటూ వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర నాయకులు షేక్ జిలానీబాషా బృందం నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ యాత్ర బుధవారం సాయంత్రం సిద్దవటం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు 2400 కిలోమీటర్ల పాదయాత్రను చేపడుతున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువత స్వర్ణ భవిష్యత్, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ×ఉండాలి జగన్ ఉంటాడు జగన్≈ అనే నినాదంతో ఈ యాత్రను ప్రారంభించామన్నారు. సంక్షోభం నుంచి సంక్షేమం వైపు అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరిస్తున్నామన్నారు.

సత్కారం


రాజశేఖర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది, స్టాంప్ వెండర్స్

లక్కిరెడ్డిపల్లె : ఉత్తమ సబ్ రిజిస్టర్‌గా మంగళవారం రాయచోటి పరేడ్ గ్రౌండ్స్‌లో సేవా పురస్కారం అందుకున్న రాజశేఖర్‌ను లక్కిరెడ్డిపల్లె రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది, స్టాంప్ వెండర్స్ సత్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు రాజశేఖర్‌ను దుశ్శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనులు ఉపయోగకరంగా ఉండాలి


సామాజిక తనిఖీలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ మద్దిలేటి

పెనగలూరు : ఉపాధి హామీ పథకంలో కూలీలతో చేయించే పనులు ఉపయోగకరంగా ఉండాలని డ్వామా పీడీ మద్దిలేటి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ, ప్రజా వేదిక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డ్వామా పీడీ మండలంలో చేసిన ఉపాధి పనులు, డీఆర్‌పీలు తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏడాది కాలంగా రూ. 12.5 కోట్లతో ఉపాధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కూలీలకు రూ. 9.20కోట్లు, మెటీరియల్ కింద రూ. 3.30 కోట్లు ఖర్చు చేసినట్లు పీడీ తెలియజేశారు. డీఆర్‌పీల తనిఖీలలో రూ. 8.65 లక్షలు రికవరీకి ఆదేశించామన్నారు. సమావేశంలో రూ. 15,139లు నగదు రూపంలో రికవరీ చేశామన్నారు. రూ. 27,927లకు ఎంక్వైరీ వేశామని, పనిముట్ల కింద రూ. 6.40 లక్షలు, డ్రాపింగ్ కింద రూ. 1.81లక్షలు చూపించినట్లు వారు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేయించేటప్పుడు ముఖ్యంగా ఉపాధి సిబ్బంది ప్రజల అవసరాలు తీర్చేలా ఉండాలన్నారు. అందులో ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. అలాగే ఉపాధి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ ప్రతాప్, జిల్లా విజిలెన్సు అధికారి ప్రకాష్, ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్ఆర్‌పీలు చంద్రమోహన్, భాస్కర్ రాజు, ఏపీఓ మురళి, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19న వార్డు సభ్యుల స్థానాలకు ఉప ఎన్నిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ జవహర్‌బాబు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1, ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న వార్డులకు ఈనెల 19వ తేదీన ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 19న ఉదయం 7 నుంచి 1 గంట వరకు పోలింగ్, ఆ తరువాత ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం ఫలితాల ప్రకటన చేస్తామని తెలియజేశారు. మాధవరం 2వ వార్డులో 417 ఓట్లు ఉండగా, పార్వతీపురంలోని ఎంపీపీ స్కూల్‌లో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయగా, ఉప్పరపల్లె వార్డు ఎన్నికల్లో 140 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. ఇందుకోసం ఎస్‌పీబీవీడీ సభా హైస్కూల్‌లో ఓటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. కాగా మాధవరం–1 పంచాయతీలో 2వ వార్డుకు వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి, ఉప్పరపల్లె పంచాయతీలోని 10వ వార్డుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.

ఇంటింటి సర్వే పక్కాగా జరగాలి


మాట్లాడుతున్న రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట : రాజంపేట నియోజకవర్గంలో ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఇంటింటి సర్వే పక్కాగా జరగాలని రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ సభ భవనంలో రాజకీయ పార్టీల నేతలతో ఓటర్ల నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. కొత్త ఓటర్ల నమోదు చేసుకోవడం, మృతి చెందిన వారి పేర్లు తొలిగించడం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఏ ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదన్నారు. ఆ దిశగా బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తమ విధులను బాధ్యతయుతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఏఈఆర్వోలు మాధవీలత, లక్ష్మీదేవి, సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్ సత్యానందం, మహేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

21లోపు పూర్తి చేయాలి

సిద్దవటం : ఓటర్ల జాబితాకు సంబంధించి బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేని ఈనెల 21లోపు పూర్తి చేయాలని తహసీల్దారు లక్ష్మీదేవి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండలంలో 18 సంవత్సరాలు వయస్సు నిండిన యువతీయువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదు కోసం ఫారం – 6, ఓటర్లను తొలగించేందుకు ఫారం–7, ఓటర్ల మార్పు, చేర్పుల కోసం ఫారం–8 దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

చెరువులు, కుంటలకు జలకళ


ముద్దప్పకుంటలో గంగమ్మకు హారతి పడుతున్న ప్రజా ప్రతినిధులు, రైతులు

గాలివీడు : వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్ ద్వారా కుడి కాలువలో కొద్ది రోజుల క్రితం రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి నీటిని విడుదల చేశారు. ఈ నీటితో కుడి కాలువ కింద ఉన్న చెరువులు, కుంటలు జలకళను సంతరించుకొంది. రైతులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు బుధవారం చెరువులు, కుంటల వద్ద గంగమ్మకు టెంకాయలు కొట్టి హారతి పట్టారు. రిజర్వాయర్ ద్వారా రైతులు సంవత్సరానికి మూడు పంటలు సాగు చేసుకొంటూ సంతోషంగా ఉన్నామని, ఇదంతా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పుణ్యమేనన్నారు. ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రైతున్నలు పంటలు సాగు చేసుకోవాలనే ఉద్దేశంతో కుడి కాలువ పూడిక తీసే పనులు చేపట్టి కుంటలు, చెరువులు జలకళను సంతరించుకునేలా ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

రైల్వేకోడూరు : ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో శ్రేయస్కరమని జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని అనంతరాజుపేట గ్రామ పంచాయతీలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆర్థికంగా మార్కెట్ పరంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. పంజం వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీటీసీ మల్లికార్జున, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి


కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి సృజన

నందలూరు(రాజంపేట) : ఏడాదిలోపు వయస్సు కలిగిన ఉన్న పిల్లలకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలని నందలూరు వైద్యాధికారిణి డాక్టర్ మద్దెల సృజన అన్నారు. బుధవారం నందలూరు–1 సచివాలయంలోని వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేయడమే కాదు, వాటి వల్ల వచ్చే ఉపయోగాలను పిల్లల తలితండ్రులకు వివరించారు. ప్రాణాంతక వ్యాధుల నుంచి బయటపడాలంటే ముందుస్తుగా నివారణ టీకాలు వేయించడం ఎంతైనా అవసరమన్నారు. టీకాలు వేయించుకునే విషయంలో పిల్లల తల్లితండ్రులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ ఆరీఫ్, వైద్యసిబ్బంది లక్షుమయ్య, శాంతకుమారి, అంజనమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్

రైల్వేకోడూరు అర్బన్ : సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి మండలాలకు చెందిన నలుగురికి ఆయన రూ. 4 లక్షలు విలువజేసే చెక్కులను పంపిణీ చేశారు.

ఎస్సీలు సీఎం జగన్‌కు అండగా ఉండాలి


శ్రీనివాసులను సన్మానిస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

పుల్లంపేట : ఎస్సీ ప్రజలంతా జగనన్నకు అండగా ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పుల్లంపేట మండలంలోని కుమారునిపల్లి హరిజనవాడలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మడగలం శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎస్సీ కార్పొరేషన్, నవరత్నాలు ద్వారా రూ. 8 వేల కోట్లు ఖర్చుచేశారన్నారు. ఎస్సీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని విన్నవించారు. దళితులను ఘోరంగా అవమానించిన చంద్రబాబును దళితులు ఎట్టి పరిస్థితుల్లో నమ్మరని తెలియపరిచారు. అనంతరం మడగలం శ్రీనివాసులను అంబేద్కర్ యూత్ సభ్యులు రాజేష్, సుబ్రమణ్యం, ఎల్లయ్య తదితరులు సన్మానించారు.

కొండావాండ్లపల్లెలో పర్యటించిన డీఎంహెచ్‌ఓ


ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి కొండయ్య

సంబేపల్లె : మండల పరిధిలోని కొండావాండ్లపల్లెలో బుధవారం జిల్లా వైద్యాధికారి కొండయ్య పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో షుగర్, రక్తపోటు వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. ప్రతి గర్భిణీ పేరును నమోదు చేసి, వారికి వ్యాధి నిరోధక టీకాలతోపాటు ఐరన్ మాత్రలను అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యాలపై సూచనలు చేశారు. ప్రతి సర్వే రికార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కొండావాండ్లపల్లె ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ చేసి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరితమైన రోగులను పరిశీలించి వారికి సంబంధించిన మందులను వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి, బలరామరాజు, వైద్య సిబ్బంది రవిశంకర్, భాగ్యమ్మ, సునిత, రాజులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్ : కడప యర్రముక్కపల్లె, స్టేట్ బ్యాంక్ పక్కన గల ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ నెల 18వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. షుగర్, థైరాయిడ్, టీబీ, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధి గ్రస్తులకు ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. థైరాయిడ్, షుగర్, ఊపిరితిత్తుల సాంద్రత పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. షుగర్, థైరాయిడ్ పరీక్షలకు పడగడుపున ఉదయం 6 గంటలకు రావాలని తెలిపారు.